RNI NO : TELTEL/2023/88524

మెదక్ టైమ్స్ దిన పత్రిక

మంచిమాట

ఆలోచించు. కానీ సమయం మించిపోకముందే ఆలోచనను కట్టిపెట్టి ఆచరణకు దిగు.

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 318
బుధవారం, నవంబర్ 04, 2026 , పేజీలు - 4 వెల : 2/-

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై సీఎం రేవంత్ సమీక్ష..

ముంపు భూములకు పరిహారంపై స్పష్టత

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు



హైదరాబాద్: తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన సీఎం.. ప్రాజెక్టు పురోగతి, మహారాష్ట్రతో సమన్వయం, ముంపు సమస్యలు, పరిహారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. ప్రాజెక్టు కారణంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు, ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని కీలక పత్రాలను ఆ రాష్ట్ర అధికారులకు అందజేయాలని రేవంత్ స్పష్టం చేశారు. అలాగే, ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. పరిహారం చెల్లింపుల కోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో అందుబాటులో ఉంచుతామని రేవంత్ స్పష్టం చేశారు. ముంపునకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సర్వే నిర్వహించినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని, ఆజ్ఞాపించారు.

"24 గంటలు గడిచిపోయాయి మోడీ జీ"-!

ఇప్పటికైనా రండి రాహుల్ సవాల్..!



విదేశీ శక్తుల సాయంతో దేశాన్ని ముక్కలు చేసేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నట్లు ప్రధాని మోడీ చేసిన ఆరోపణలపై చర్చకు రావాలంటూ విపక్ష నేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. అయితే ప్రధాని మోడీ మాత్రం 24 గంటలైనా స్పందించక పోవడంపై రాహుల్ మరో ట్వీట్ చేశారు. ఇందులో మోదీ జీ, 24 గంటలు గడిచిపోయాయి, ప్రతిపక్షం దేశద్రోహి అని మీరు చేసిన వ్యాఖ్యలపై చర్చకు ఏదైనా వేదికను, స్థలాన్ని ఎంచుకోవాలని, తనతో చర్చకు రావాలని రాహుల్ మరోసారి కోరారు. అసలు దేశద్రోహి ఎవరు? విదేశీ శక్తులతో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? ఆ సంబంధాలు ఎలాంటివి? అని ప్రశ్నించారు. ఆలస్యం చేయకండి, త్వరగా రండి, భయపడకండి అంటూ మోడీకి చురకలు అంటించారు.మనం ఇద్దరం అక్కడ ఉంటాం, మీడియా ఉంటుంది, దేశ యువత ఉంటుంది. ఒక టేబుల్ ఉంటుంది, ఒక వైపు మీరు కూర్చుంటారు, మరో వైపు నేను కూర్చుంటాను. మీరు ఎవరిని న్యాయనిర్ణేతగా నియమించా లనుకుంటున్నారో, వారిని తీసుకురండి. కావాలంటే మోహన్ భగవత్ జీని ఆ కుర్చీలో కూర్చోబెట్టండి, రండి, మనం చర్చిద్దామంటూ రాహుల్ ప్రధాని మోడీకి తెలిపారు. ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నిర్మాణం, అమెరికాతో ఒప్పందం ఎలా జరిగింది, ఎందుకు జరిగింది, ఇంత వేగంగా ఎందుకు జరిగింది, మీరు ఒక్కరే ఎందుకు నిర్ణయం తీసుకున్నారు, క్యాబినెట్‌కు ఎందుకు చెప్పలేదు, ఎవ్ స్టీన్ వ్యవహారం, ఇలాంటి అనేక అంశాలపై బహిరంగంగా చర్చిద్దామన్నారు.

కేసీఆర్ హయాంలో

తెలంగాణ సొత్తును కొల్లగొట్టారు..

మంత్రి పొంగులేటి ధ్వజం



ఖమ్మం జిల్లా, నవంబరు 3 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను ఏలి పేదోళ్ల కష్టాలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. వారి స్వార్థానికి, స్వలాభానికి రాష్ట్ర సొత్తును ఆ దొరలు కొల్లగొట్టి, ప్రజలను పేదవాళ్లుగా చేశారని ఆగ్రహించారు. ఈరోజు (మంగళవారం) ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ తెల్దారుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు.పొర్లు దండాలు పెట్టుకుంటూ ప్రతిపక్షాల నేతలు తమ ప్రభుత్వం గురించి విమర్శలు చేస్తున్నారని మంత్రి పొంగులేటి దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో రైతులు వరి సాగు వేస్తే ఉరే అన్నారని.. తమ ప్రభుత్వం అన్నదాతలు పండించిన పంటకు బోనస్ ఇచ్చి ఆదుకుందని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి పేదింటికి సంక్షేమ కార్యక్రమాలను అందజేస్తోందని వెల్లడించారు. తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. మళ్లీ మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తామని భరోసా కల్పించారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు తెలంగాణ సర్కారు అండ..

ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు



హైదరాబాద్: మహిళా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు, విధాన పరమైన సహకారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేసింది. డిసెంబరు 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మహిళా పారిశ్రామిక రంగంపై ప్రత్యేక శ్వేతపత్రాన్ని సమిట్‌లో విడుదల చేయనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతో పాటు వారి వ్యాపారాల విస్తరణకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు, విధానపరమైన సహకారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు పారిశ్రామిక రంగంలో తెలిపారు.

దేశంలోనే రిచెస్ట్ రాజ్యసభ ఎంపీ తెలంగాణ నుంచే..

టాప్-3లో ఇద్దరు..

ఇండియాలో అత్యంత శ్రీమంతులైన రాజ్యసభ ఎంపీల జాబితాలో తెలంగాణ రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్(ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. దేశంలోని టాప్-3 అత్యంత ధనిక రాజ్యసభ ఎంపీలలో ఇద్దరు తెలంగాణకు చెందినవారే కావడం గమనార్హం.

బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.5,300 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక రాజ్యసభ ఎంపీగా మొదటిస్థానంలో నిలిచారు. పంజాబ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాజిందర్ గుప్తా(రూ.5,053 కోట్లు) రెండో స్థానంలో ఉండగా.. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వి రూ.2,558 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో ఉన్నారు. ఈ ఇద్దరు ఎంపీల ఆస్తులే తెలంగాణ



రాజ్యసభ సభ్యుల మొత్తం ఆస్తుల్లో దాదాపు 95 శాతంగా ఉండటం విశేషం. తెలంగాణలోని ఏడుగురు రాజ్యసభ ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ.8,310 కోట్లుగా నమోదై, దేశంలోనే అత్యధిక ఆస్తులు కలిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. తెలంగాణ ఎంపీల ఆస్తుల ర్యాంకింగ్స్‌లిబండి పార్థసారథి రెడ్డి(బీఆర్ఎస్): రూ.5,300 కోట్లు(చరాస్తులు: రూ.5,215 కోట్లు, స్థిరాస్తులు: రూ.84 కోట్లు)-ర్యాంక్-1లిఅభిషేక్ మను సింఘ్వి(కాంగ్రెస్): రూ.2,558 కోట్లు(చరాస్తులు: రూ.2,104 కోట్లు, స్థిరాస్తులు: రూ.453 కోట్లు, వార్షికాదాయం: రూ.374 కోట్లు)- ర్యాంక్ 3లిరేణుకా చౌదరి (కాంగ్రెస్): రూ.178 కోట్లు -ర్యాంక్ 23లిదివికొండ దామోదర్ రావు(బీఆర్ఎస్):
రూ.124 కోట్లు- ర్యాంక్ 28

రాహుల్ జుగుప్సాకరమైన వ్యక్తి..

విదేశీ సాయం వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. విదేశీ సాయంతోనే ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలో కొనసాగుతున్నారని రాహుల్ ఎక్స్‌లో ఆరోపించిన విషయం తెలిసిందే. బీజేపీ ఆర్థిక వ్యవస్థను విదేశీయులే నియంత్రిస్తున్నారని ఆయన ట్వీట్ చేశారు. దీంతో ఆయన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ ప్రతినిధి సీఆర్ కేశవన్ తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. రాహుల్ గాంధీ ఒక అసహ్యకరమైన, జుగుప్సాకరమైన వ్యక్తి అని ఆయన విమర్శించారు. రాహుల్ నిరాధార, పేలవ ఆరోపణలు చేసి చివరకు నవ్వులపాలవుతారని, అది ఆయనకు అలవాటేనని కేశవన్ ట్వీట్ చేశారు. వాస్తవానికి 2023 మార్చిలో యూకేలో భారత ప్రజాస్వామ్యం గురించి రాహుల్ దిగజారి మాట్లాడారని విమర్శించారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం కోరింది రాహులేనని మండిపడ్డారు.నాడు రాహుల్ మాట్లాడిన వీడియోను ఆయన షేర్ చేశారు. కాంగ్రెస్ నాయకత్వానికి ఫోరం ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ ఇన్ ద ఏషియా పసిఫిక్‌తో సంబంధాలు ఉన్నాయని, అంతేకాకుండా జార్జ్ సోరోస్ ఫౌండేషన్ నుంచి కాంగ్రెస్‌కు నిధులు కూడా అందాయని ఆయన ఆరోపించారు.

డొనాల్డ్ ట్రంప్‌కు బిగ్ ట్రబుల్..

అమెరికాలో బ్లూ వేవ్!



అమెరికా: అగ్రరాజ్యం అమెరికాలో మధ్యంతర ఎన్నికల పోరు తీవ్ర రూపం దాల్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండేళ్ల పాలనకు, ఆయన తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలకు ఈ ఎన్నికలు ఓ రకంగా ప్రజా తీర్పుగా మారాయి. యూఎస్ కాంగ్రెస్‌లోని ఎగువ సభ 'సెనెట్', దిగువ సభ 'హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్'(ప్రతినిధుల సభ)పై పార్టీ ఆధిపత్యం సాధిస్తుందనేది రాబోయే రెండేళ్ల అమెరికా రాజకీయ దిశను, క్యాపిటల్ హిల్ పర్యవేక్షణను నిర్దేశించనుంది.ప్రస్తుతం అమెరికన్లను వేధిస్తున్న తీవ్ర ద్రవ్యోల్బణం, పెరిగిన హెల్త్‌కేర్, నిత్యావసరాలు, ఇంధన ధరలు డొనాల్డ్ ట్రంప్ సర్కారుకు పెద్ద తలనొప్పిగా మారాయి. వీటితో పాటు ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం ప్రజల్లో మరింత అసంతృప్తిని పెంచింది. ఎన్నికల సర్వేల ప్రకారం డొనాల్డ్ ట్రంప్ 'జాబ్ అప్రూవల్ రేటింగ్' కేవలం 39 శాతానికి పడిపోగా.. దాదాపు 61 శాతం మంది ప్రజలు ఆయన పనితీరుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి రిపబ్లికన్ పార్టీకి రెండు సభల్లోనూ అధిక్యాన్ని కోల్పోయే ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది.మరోవైపు ప్రతిపక్ష డెమోక్రాట్లకు అనుకూలంగా బ్లూ వేవ్ వీస్తోందని పేర్కొంటున్నాయి.

జగన్ కోటను కూల్చిన టీడీపీ..!

ప్రతీకారం తీర్చుకున్న చంద్రబాబు..!





అమరావతి: ఏపీలో తాజాగా నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో అత్యంత ఉత్కంఠ రేపిన పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. విపక్ష వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ సొంత నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికలు కావడంతో కూటమికీ ఇవి ప్రతిష్టాత్మకంగా మారాయి. దీంతో ముందు నుంచే పక్కాగా ప్లాన్ చేసిన టీడీపీ ఎక్కడా వైసీపీకి అవకాశం ఇవ్వకుండా పులి వెందులను తమ ఖాతాలో వేసేసుకుంది. ఇవాళ ఓట్ల లెక్కింపు తర్వాత పులివెందుల మున్సిపల్ చైర్ పర్సన్ సీటుతో పాటు వార్డుల్నీ ఏకపక్షంగా టీడీపీ కైవసం చేసుకుంది.పులివెందుల మున్సిపాలిటీలోని 40 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. ఇందులో 20 వార్డుల్ని ముందుగానే టీడీపీ ఏకగ్రీవం చేసేసు కుంది. ఇక మిగిలిన 20 వార్డులతో పాటు పులివెందుల మున్సిపల్ చైర్ పర్సన్ పదవికీ ఎన్నికలు జరిగాయి. దీంతో పోలింగ్ రోజు స్థానిక ఎమ్మెల్యే వైఎస్ జగన్, స్థానిక ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సహా వైసీపీ నేతలంతా అక్కడే పాగా వేశారు. అయినా పోలీసుల సహకారంతో వైసీపీ ఏజెంట్లను బూత్ లలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్న టీడీపీ.. ఎన్నికల్ని ఏకపక్షంగా మార్చుకుంది.దీంతో ఇవాళ నిర్వహించిన ఎన్నికల ఓట్ల లెక్కింపులో టీడీపీ మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి గీతా కుమారి తన ప్రత్యర్థి అయిన వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీలపై ఏకంగా 13, 875 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అలాగే పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఏకగ్రీవం అయిన వార్డులతో కలిపి టీడీపీ 34 వార్డుల్ని గెల్చుకుంది. బీజేపీ రెండు వార్డుల్ని దక్కించుకుంది. జనసేన ఒక వార్డులో గెలుపొందింది. వైఎస్సార్సీపీ కేవలం 3 వార్డులకే పరిమితమైంది. దీంతో టీడీపీ పులివెందుల మున్సి పాలిటీతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ పదవీని చేజిక్కిం చుకు న్నట్లయింది. ఈ గెలుపుతో గతంలో వైసీపీ హయాంలో పట్టుబట్టి చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పం మున్సిపాలిటీని జగన్ దక్కించుకున్న తరహాలోనే చంద్రబాబు ఇప్పుడు పులివెం దులను గెల్చుకున్నారు. తద్వారా జగన్ పైప్రతీకారం తీర్చుకున్నట్లయింది.

శంకరంపేట-ఆర్ చేగుంట పోలీస్ స్టేషన్లలో
అదనపు ఎస్పీ ఆకస్మిక తనిఖీలు





చేగుంట నవంబర్ 03 మెదక్ టుడే న్యూస్

మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ మంగళవారం శంకరంపేట-ఆర్, చేగుంట పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. సీసీటీన్స్ , ఈ-సాక్ష్య యాప్ లలో వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్యం చేయాలన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్ బెల్ట్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు.ఈ తనిఖీల్లో తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, శంకరంపేట-ఆర్ ఎస్ఐ శివనందం, చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చేగుంటలో ఫొడ్రామా తహసీల్దార్ తీరుపై సర్పంచుల ఆగ్రహం
సమావేశం నుంచి వాకౌట్



చేగుంట, నవంబర్ 03.మెదక్ టుడే న్యూస్

చేగుంట మండల కేంద్రంలో గందరగోళం. మండల సాధన సమావేశానికి తహసీల్దార్ గైర్హాజరు కావడంపై సర్పంచులు భగ్గుమన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ సమావేశం నుంచి వాకౌట్ చేసి నిరసనకు దిగారు.మండలంలో తీవ్ర కరువు పరిస్థితులునెలకొన్నాయని, పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వెంటనే చేగుంట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్లు పాల్గొనడం జరిగినది

వి బి జి - రాంజీ పథకం జలసిరి పనుల పురోగతి
సాధించాలని అదనపు కలెక్టర్ నగేష్..





మెదక్,నవంబర్,3,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)

కలెక్టరేట్ ప్రజావాణి హాలులో మంగళవారం జిల్లాలోని గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా చేపడుతున్న జలసిరి పనులు ఫారం పాండ్ ఇంకుడు గుంతలు వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం బోర్వెల్ రిఫ్రో సక్చర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం,వికసిత భారత్ – గ్రామీణ ఉపాధి మరియు జీవనోపాధి మిషన్ హామీ పథకం" పథకం కింద లేబర్ పని దినాలు సంబంధిత అంశాలపై డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య సంబంధిత ఎంపీడీవోలతో. అదనపు కలెక్టర్ నగేష్ సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని పనులు మంజూరు చేసుకుని నవంబర్ 20 తేదీలోపుగ్రౌండింగ్ చేయాలని అన్నారు .జిల్లాలో 390 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజు ల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు పటిష్టంగా పనిచేయాలన్నారు.ఈకార్యక్రమంలో సంబంధిత ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో అలసత్వం సహించేది లేదు

- వెల్దుర్తి తహసీల్దార్‌పై చర్యలకు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశం
- భూ రీ-సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు - - రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలి





మెదక్,నవంబర్,3,(మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)

రెవెన్యూ సేవల్లో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించేది లేదని, పారదర్శక రెవెన్యూ పాలన లక్ష్యంగా తహసీల్దార్లు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూభారతి రీ-సర్వే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భూ సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో భూధార్, భూ రీ-సర్వే, ధాన్యం కొనుగోళ్లు, ఆర్ఆర్ఆర్, ప్రజావాణి పెండింగ్ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో పారదర్శక రెవెన్యూ పాలన అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే భూ సంబంధిత ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.భూ రీ-సర్వే నిర్వహించే సమయంలో రైతులకు ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలోనే భూముల సరిహద్దులను గుర్తించాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండటంతోపాటు తమ మండలాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సర్వే బృందాలు నిర్వహిస్తున్న పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లినప్పుడు వెల్దుర్తి మండల తహసీల్దార్‌కు సర్వే నిర్వహణపై సరైన అవగాహన లేకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వెల్దుర్తి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్‌ను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు.ఆధార్ తరహాలో ప్రతి భూభాగానికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యగా భూధార్ నంబర్ కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రీ-సర్వే ఆధారంగా భూధార్ నంబర్, ల్యాండ్ బేస్డ్ మ్యాప్ (ఎల్‌బీఎం) అనుసంధానంతో భూ హక్కులు, సరిహద్దులపై స్పష్టత వస్తుందని, భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాల్లో అక్రమాలు, ఫోర్జరీలకు అవకాశం ఉండదని తెలిపారు.వివిధ కోర్టులు, ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలకు సంబంధించి అవసరమైన రికార్డులతో కౌంటర్ అఫిడవిట్లను సకాలంలో దాఖలు చేయాలని ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాల పరిష్కారానికి జాయింట్ ఫీల్డ్ సర్వే నిర్వహించి శాశ్వత పద్ధతిలో హద్దులు ఖరారు చేయాలన్నారు.జీవో 59 కింద ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న అర్హులైన పేదల ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో అర్హతలను నిర్ధారించిన తర్వాతే నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ల్యాండ్ అక్విజిషన్ లక్ష్యాలను కూడా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్షిస్తూ.. జిల్లాలో ప్రారంభించాల్సిన 530 కేంద్రాలకు గాను ఇప్పటివరకు 280 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. 14 కేంద్రాల ద్వారా 412 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మిగిలిన కొనుగోలు కేంద్రాలను కూడా పూర్తిస్థాయిలో ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

ఈసమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మహమ్మద్ అహ్మద్, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, తూప్రాన్ ఆర్డీవో భావయ్య, సంబంధిత తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

టెండర్ లో కోడ్ చేసిన గుత్తేదారులు అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన
కందిపప్పు అందించాలని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు.



మెదక్,నవంబర్,3,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)

మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్యఅతిథిగా టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం జరిగింది

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ 1076 అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన కందిపప్పు వన్ కేజీ ప్యాక్ సరఫరా చేయుటకు ఆసక్తిగల ప్రభుత్వ వాణిజ్య పనుల శాఖ నందు రిజిస్టర్ అయిన మిల్లర్స్ హోల్సేల్ గవర్నమెంట్ ఏజెన్సీస్ వ్యాపారస్తుల నుండి గతంలోనే టెండర్కు ఆహ్వానించడం జరిగిందని తెలిపారు

తద్వారా ఈరోజు టెం డర్ల కార్యక్రమం నిర్వహించి సమర్థత గల వ్యాపారస్తులకు నాణ్యమైన కందిపప్పు అంది ంచేందుకు టెండర్లు దక్కించుకోవడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి హేమ భార్గవి, పౌరసరఫరాల అధి కారి నిత్యానంద్, మేనేజర్ జగదీష్, డీఈఓ రాజు, రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్ర వర్తి సంబంధిత గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సూచించిన ధరలకే బియ్యం విక్రయించాలి



- అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు
- జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్

మెదక్,నవంబర్,3,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)

మంగళవారం కమిషనర్, పౌర సరఫరాల శాఖ వారి ఆదేశాల మేరకు, మెదక్ పట్టణంలోని ఆర్వీదీప్ సూపర్ మార్కెట్, జి.వి. సూపర్ మార్కెట్‌తో పాటు ఇతర బియ్యం విక్రయ దుకాణాలలో మెదక్ జిల్లా పౌర సరఫరాల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ధరలకే బియ్యం విక్రయించాలని సంబంధిత వ్యాపారులకు అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసామన్నారు.ప్రభుత్వం సూచించిన గరిష్ట విక్రయ ధరలు:బిపిటి, కేఎన్ఎం, బియ్యం: కిలోకు రూ.66– ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా బియ్యం: కిలోకు రూ.74– హెచ్ఎంటి, జె ఎస్ ఆర్,బియ్యం: కిలోకు రూ.79–పై ధరలకు మించి బియ్యం విక్రయించరాదని వ్యాపారులను హెచ్చరించారు.ప్రభుత్వం సూచించిన ధరలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీ పి. నిత్యానందం, అసిస్టెంట్ పౌర సరఫరాల అధికారి శ్రీ ఎం.డి. అబ్దుల్ నిస్సార్, పౌర సరఫరాల శాఖ ఇన్స్పెక్టర్ శ్రీ తాటి నర్సింలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వడియారం శివ పంచాయతన దేవాలయానికి రూ. 5000 విరాళం
అందించిన చేగుంట ఉప సర్పంచ్ మహ్మూద్ రఫీ

- చేగుంట వెంకటేశ్వర స్వామి దేవాలయానికి 8000 రూపాయలు విరాళం





చేగుంట, నవంబర్ 03 మెదక్ టుడే న్యూస్

మత సామరస్యానికి, సేవా తత్పరతకు నిదర్శనంగా నిలుస్తున్నారు చేగుంట గ్రామ ఉప సర్పంచ్ మహ్మద్ రఫీ. కుల మతాలకు అతీతంగా ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.వడియారం గ్రామంలో కొలువుదీరిన శివ పంచాయతన (ఆంజనేయ స్వామి)ఆలయంలో నిత్య ధూప దీప నైవేద్యం నిర్వహణ కోసం రూ. 5,000 విరాళాన్ని ఆయన అందజేశారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈ విరాళాన్ని అందిస్తూ భక్తి భావాన్ని చాటుకుంటున్నారు.ఆలయంలో ధూప దీప నైవేద్యం సక్రమంగా జరగాలనే ఉద్దేశంతో తాను ఈ సహాయం చేస్తున్నట్లు ఉప సర్పంచ్ మహ్మద్ రఫీ తెలిపారు. దేవుడికి కులం లేదని, సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందని ఆయన అన్నారు. కేవలం వడియారం ఆలయానికే కాకుండా, చేగుంట మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి కూడా ప్రతి నెలా రూ. 8,000 విరాళంగా అందిస్తున్నారు. ఇలా వివిధ ఆలయాలకు తన సొంత నిధులతో సహాయం చేయడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనం.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఉప సర్పంచ్ మహ్మద్ రఫీకి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు.మాట ఇచ్చిన ప్రకారం ప్రతి నెలా క్రమం తప్పకుండా విరాళం అందిస్తున్న ఆయన సేవా గుణాన్ని గ్రామస్తులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు. ఆయన ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షిస్తున్నారు. ఇతర ప్రజా ప్రతినిధులకు ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

సూతన డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్



అమీన్‌పూర్, నవంబర్ 03:
(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్--47 నూతన డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమారి ఎ. లలిత శ్రావణిని అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్, పటేల్‌గూడ మాజీ సర్పంచ్ ఈర్ల నీతీషా శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈర్ల దేవానంద్ మాట్లాడుతూ... అమీన్‌పూర్ పరిధిలోని పలు కాలనీల సమగ్ర అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పన, అలాగే ప్రజా సమస్యల సత్వర పరిష్కారంలో మున్సిపల్ యంత్రాంగానికి తమ వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ అమీన్‌పూర్ సర్కిల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి, ఈర్ల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

చద్దన్నంతో ఎన్నో ప్రయోజనాలు భీ చద్దన్నం అని చీప్‌గా తీసిపారేయకండి



చాలామంది చద్దన్నం అంటే ఇష్టపడరు. కొందరైతే చద్దన్నం అనే మాట వింటేనే వ్వాక్ అంటారు. అమ్మో చద్దన్నం తినడం నావల్ల కాదు అని చెబుతుంటారు. కానీ ఒక్కసారి చద్దన్నం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకున్నారంటే ఇకపై చద్దన్నం వద్దు అనే మాట మీ నోట రానే రాదు. రాత్రి మిగిలిన అన్నాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో పొద్దున తినడం మాత్రమే కాదు.. రాత్రికి మిగలేలా అన్నం వండుకుని మరీ ఉదయాన్నే చద్దన్నం తింటారు. చద్దన్నంలో అంత గొప్ప తనం ఏముంది అనుకుంటున్నారా.. అయితే వివరాల్లోకి వెళ్దాం పదా..

చద్దన్నంతో ఎన్ని లాభాలుంటాయో ఇటీవల అమెరికన్ న్యూట్రిషియన్ అసోసియేషన్ అధ్యయనంలో వెల్లడైంది. ఆ అధ్యయనం ప్రకారం.. అన్నం పులిస్తే ఐరన్, పొటాషియమ్, కాల్షియం వంటి సూక్ష్మ పోషకాల స్థాయి పెరుగుతుంది. అందుకే చద్దన్నంలో ఆ పోషకాల పాళ్లు ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు రాత్రి వండిన అన్నంలో 100 గ్రాములకు 3.4 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటే.. తెల్లారేసరికి అది 73.91 మిల్లీ గ్రాములకు పెరుగుతుంది. బీ6, బీ12 విటమిన్లు కూడా ఎక్కువగా లభిస్తాయి. అందుకే చద్దన్నం తింటే శరీరం తేలికగా ఎనర్జిటక్‌గా ఉంటుంది.అంతేకాదు చద్దన్నంతో శరీరానికి కావాల్సినంత బ్యాక్టీరియా లభిస్తుంది. ఒంట్లో వేడి చేయడం కారణంగా మన బాడీలో కలిగే దుష్ఫలితాలను చద్దన్నం తగ్గిస్తుంది. తరచూ చద్దన్నం తినడంవల్ల ఫైబర్ కంటెంట్ పెరిగి మల బద్దకం, నీరసం లాంటి సమస్యలు తగ్గిపోతాయి. అదేవిధంగా రక్తపోటు (బీపీ) అదుపులో ఉండి, పిల్లలకు కూడా చద్దన్నం మంచి పౌష్టికాహారం.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అమీన్‌పూర్-బీరంగూడ విద్యార్థుల ప్రభంజనం

5 స్వర్ణాలు, 3 రజత పతకాలు కైవసం





అమీన్‌పూర్, నవంబర్ 03:
(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లోని చంద్ ఖురి, మాతా కౌశల్యా ధామ్ (శ్రీరామ్ రాజా రిసార్ట్) వేదికగా నిర్వహించిన “5వ ఎస్ ఎస్ కె ఐ ఏ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ – 2026” పోటీలలో అమీన్‌పూర్, బీరంగూడ పరిధిలోని విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. ‘క్రేజీ క్రూ షోటోకన్ కరాటే అకాడమీ’ వ్యవస్థాపకులు, డైరెక్టర్ మాస్టర్ జి. సంతోష్ రెడ్డి (బ్లాక్ బెల్ట్ 3వ డాన్) ఆధ్వర్యంలో శిక్షణ పొందిన నలుగురు క్రీడాకారులు మొత్తం 5 బంగారు, 3 వెండి పతకాలను సాధించి తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారు.

పతకాల వివరాలు:పోటీలలోని కాతా , కుమితే విభాగాలలో విద్యార్థులు కనబరిచిన ఫలితాలు:..సంజిత్ కాతా విభాగంలో మొదటి స్థానం (బంగారు పతకం), కుమితే విభాగంలో మొదటి స్థానం (బంగారు పతకం). శివాన్ష్, కాతా విభాగంలో మొదటి స్థానం (బంగారు పతకం), కుమితే విభాగంలో మొదటి స్థానం (బంగారు పతకం).
సుధా శ్రీ ,కుమితే విభాగంలో మొదటి స్థానం (బంగారు పతకం), కాతా విభాగంలో రెండవ స్థానం (రజత పతకం). వేదా సిద్ధార్థ, కాతా విభాగంలో రెండవ స్థానం (రజత పతకం), కుమితే విభాగంలో రెండవ స్థానం (రజత పతకం)మాస్టర్ జి. సంతోష్ రెడ్డి స్పందన: ఈ సందర్భంగా అకాడమీ చీఫ్ కోచ్ మాస్టర్ జి. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ:
“పిల్లలు కఠిన శ్రమ, పట్టుదలతో సాధన చేసి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కరాటే కేవలం ఆత్మరక్షణ కోసమే కాకుండా పిల్లల్లో శారీరక దృఢత్వం, ఏకాగ్రత, మానసిక స్థైర్యాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తుంది. అమీన్‌పూర్, బీరంగూడ ప్రాంతం నుంచి వెళ్లిన మన విద్యార్థులు తెలంగాణ తరఫున నిలిచి ఇన్ని పతకాలు గెలవడం ఎంతో గర్వంగా ఉంది. భవిష్యత్తులో ఈ చిన్నారులు అంతర్జాతీయ వేదికలపై దేశానికి ప్రాతినిధ్యం వహించి మరిన్ని విజయాలు సాధించేలా ఉత్తమ శిక్షణ అందిస్తాం. ఈ ప్రయాణంలో మాకు పూర్తి సహకారం అందించిన తల్లిదండ్రులకు ప్రత్యే క ధన్యవాదాలు.”జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి తర్ఫీదుని చ్చిన మాస్టర్ సంతోష్ రెడ్డిని స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీవాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా అభినందించారు.

గీతం ఇన్నోవేషన్ ఛాలెంజ్ 2026

- ఆలోచనలను ప్రదర్శించడానికి యువ ఆవిష్కర్తలకు ఆహ్వానం
- భవిష్యత్తు నిర్మించుకోవడానికి రూ.50 లక్షల వరకు నగదు పురస్కారాలు

పటాన్‌చెరు, నవంబర్ 03:
(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

దేశవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలను ఆహ్వానించి, వారి ఆలోచనలను తెలుసుకుని, వాటికి రెక్కలిచ్చేలా దాదాపు 50 లక్షల రూపాయల నగదు పురస్కారాలతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్నోవేషన్ ఛాలెంజ్ (జీఐసీ) 2026 ఆరవ ఎడిషన్ ను నిర్వహించనుంది. గీతంలోని వెంచర్ డెవలప్ మెంట్ సెంటర్ ద్వారా, బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సౌజన్యంతో దీనిని ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి విద్యార్థి వెంచర్ ఛాలెంజ్, ఆశాజనకమైన ఆలోచనలను ప్రభావవంతమైన, విస్తరించదగిన వెంచర్లుగా మార్చడానికి యువ ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది.పాఠశాల (10 నుంచి 12 తరగతులు), అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను, 2025 నుంచి పట్టభద్రులైన వారిని నిజ ప్రపంచ సవాళ్లను పరిష్కరించే వినూత్న పరిష్కారాలను సమర్పించమని ఈ ఛాలెంజ్ ఆహ్వానిస్తోంది. ఈ పోటీలో జూనియర్, సీనియర్ అనే రెండు విభాగాలున్నాయి. ఇవి నగదు బహుమతులు, నిపుణుల మార్గదర్శకత్వం, వెంచర్ కోచింగ్, ఇంక్యుబేషన్ అవకాశాలు, భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ ఎకోసిస్టమ్ లోకి ప్రవేశాన్ని కల్పిస్తాయి.జీఐసీ 2026 ఒక క్రమబద్ధమైన ప్రయాణంలో ఆన్ లైన్ స్క్రీనింగ్, వర్చువల్ బూట్ క్యాంప్, వ్యక్తిగత మార్గదర్శకత్వం వంటివి ఈనెల 20, 21 తేదీలలో ఆన్ లైన్ సెమీ-ఫైనల్స్ తో ప్రారంభమైన డిసెంబరు 11న గీతం హైదరాబాదులో జరిగే జాతీయ గ్రాండ్ ఫైనల్ తో ముగుస్తుంది.ఈ ఛాలెంజ్ వాతావరణ మార్పులను ఎదు ర్కోవడానికి (క్లైమేట్ టెక్), సుస్థిరత, వ్యవసా యం, ఫుడ్ టెక్, ఆరోగ్య సంరక్షణ, బయోటె క్నాలజీ, డీప్ టెక్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, క్రీడలు, ఫిట్ నెస్, నేరుగా వినియోగ దారులకు (డీ2సీ), ప్రజలు నేరుగా కొనుగో లు చేసి వినియోగించే ఉత్పత్తుల బ్రాండులు (కన్స్యూమర్ బ్రాండ్స్) వంటి కీలక అంశాలలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది.పోటీతో పాటు జీఐసీలో పాల్గొనే వారికి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, పరిశ్రమల అగ్రనేతలు, అనుభవజ్ఞులైన మెంటర్ల (మార్గదర్శుల)తో సంభాషించే అవకాశాలు లభిస్తాయి. ఈ రివార్డులలో సీనియర్ ట్రాక్ లో రెండు లక్షల రూపాయల వరకు నగదు బహుమతులు, గీతం ఐ- టి బి ఐ లో ఆరు నెలల ఇంక్యుబేషన్ అవకాశాలుంటాయి. జూనియర్ ట్రాక్ ఫైనలిస్టుల కోసం లీడ్ ప్రోగ్రామ్ తో పాటు ఒక ఏడాది పాటు వ్యక్తిగతంగా వెంచర్ కోచింగ్ ఉన్నాయి. ఇవేగాక, ఉత్తమ సామాజిక ప్రభావ వ్యాపార ఆలోచన అవార్డు, లెజెన్ జాన్సన్ పీపుల్స్ ఛాయిస్ అవార్డు, డాక్టర్ జీవీవీ రావు యంగ్ ఇంజనీర్ డ్రీమర్ అవార్డులు వంటి ప్రత్యేక గుర్తింపులు కూడా ఉన్నాయి.భాగస్వాముల బలమైన నెట్ వర్కు మద్దతుతో ఐదు వేలకు పైగా స్టార్టప్ ఆలోచనలు, వందకు పైగా పిచ్ లు, 50కి పైగా జ్యూరీ సభ్యులు, 30కి పైగా భాగస్వాములు, 29 రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని ఒకచోట చేర్చి, భారతదేశ విద్యార్థి ఆవిష్కరణ, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడమే జీఐసీ లక్ష్యం.ఇందులో పాల్గొనాలని అభిలషించే వారు ఈనెల 7వ తేదీలోగా తమ పేర్లను జీఐసీ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం 90630 65811, 83283 34930 నంబర్లను సంప్రదించాలి లేదా జి ఐ సి ఏ గీతం. ఈ డి యూ కు ఈ-మెయిల్ చేయాలి.

రేషన్ బియ్యంపై అక్రమార్కుల కన్ను

- రాజకీయ నాయకుల కనుసైగాల్లోనే
- అక్రమార్కులను కట్టడి చేయడంలో ప్రభుత్వ శాఖలు విఫలం
- ంషన్ బియ్యం అక్రమ దందాకు కొంతమంది అధికారుల అండదండలు
- నగరంలో,నగర శివారుల్లో రేషన్ బియ్యం దందా జోరు
- గోదాంలకు తరలింపు.. బ్రాండెడ్ సంచుల్లో రీ ప్యాకింగ్
- బియ్యం ధరలకు రెక్కలు రావడంతో పెరిగిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం
- సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ ఏది.?
- టాస్క్‌ఫోర్స్ దాడులు నామమాత్రమేనా.?

హైదరాబాద్,నవంబర్,3, మెదక్ టుడే న్యూస్:

పేదలకు అందాల్సిన ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తోంది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు అందించాల్సిన ఉచిత బియ్యం పక్కదారి పడుతూ గ్రేటర్ హైదరాబాద్ నగరం తో పాటు నగర శివారుల్లోని గోదాంలకు చేరుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు దాదాపు 80 రూపాయలకు భారీగా పెరగడంతో రేషన్ బియ్యానికి డిమాండ్ పెరిగి అక్రమ వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది. పేదల ఆకలి తీర్చాల్సిన బియ్యం అక్రమార్కుల వ్యాపారానికి కేంద్రంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

బ్రాండెడ్ సంచుల్లో రేషన్ బియ్యం

అక్రమ రవాణా చేస్తున్న బియ్యాన్ని గోదాంలలో నిల్వ చేసి, ఇతర బ్రాండ్ల పేర్లతో ఉన్న సంచుల్లో నింపి యదేచ్ఛగా మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని సేకరించడం, నిల్వ చేయడం, రీ ప్యాకింగ్ చేయడం, ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడం వంటి వ్యవహారాలు వ్యవస్థీకృతంగా సాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దందా వెనుక ఎవరున్నారు.ఎక్కడి నుంచి బియ్యం వస్తోంది. ఎవరికి సరఫరా చేస్తున్నారు.అన్న ప్రశ్నలకు అధికారుల నుంచి సమా ధానం పూర్తిగా కరువవుతోంది. ఉదయం 3 గంటల నుండి తెల్లవారు 7 గంటల వరకు ఈ దందా దర్జాగా సాగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.



శివారుల్లో భారీ షెడ్లు, గోదాంలే అడ్డాలు

బొంగులూరు గేట్, మంగళపల్లి, బడంపేట్, ఆదిబట్ల, నాదర్గుల్, జల్పల్లి, కాటేదాన్, మహేశ్వరం, ఆమనగల్, కల్వకుర్తి, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పురానాపూల్, నాగోల్, బండ్లగూడ, తుర్కయంజాల్, షామీర్‌పేట్, గజ్వేల్, రామవరం, ఘట్‌కేసర్, భువనగిరి, మౌలాలి, మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో భారీ షెడ్లు, గోదాంలలో బియ్యం నిల్వలు ఉన్నాయనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో గోదాంల కార్యకలాపాలపై సివిల్ సప్లై అధికారులకు, స్థానిక పోలీసులకు పూర్తిస్థాయి సమాచారం ఉండి కూడా చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండి సమగ్ర తనిఖీలు చేపడితే అక్రమ రవాణా వెనుక ఉన్న అసలు గుట్టు బయటపడే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పత్రికల్లో కథనాలు వచ్చినా కదలని యంత్రాంగం

కొంతమంది రాజకీయ నాయకుల ప్రజాప్రతినిధుల కనుసైకిల్లో జరిగేరేషన్ బియ్యం అక్రమ రవాణాపై పలు సందర్భాల్లో పత్రికల్లో కథనాలు వెలువడుతున్నప్పటికీ పలు శాఖల అధికారుల్లో ఆశించిన స్థాయిలో కదలిక కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు అప్పుడప్పుడు దాడులు నిర్వహించి కొంత బియ్యం పట్టుకోవడం మినహా, ఈ అక్రమ వ్యాపారం మూలాలను ఎందుకు ఛేదించలేక పోతున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణ చేస్తున్న వాళ్లపై ఐదు కేసుల పైనే ఉన్న వాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటో ఉన్నతాధికారులకే తెలియాలి. చిన్న స్థాయి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటే సరిపోతుందా. పెద్ద మొత్తంలో బియ్యం నిల్వ చేస్తున్న గోదాంల యజమానులు, సరఫరాదారులపై విచారణ ఎందుకు జరగడం లేదని, రాత్రి, తెల్లవారుజాము 3 గంటల తర్వాత రోడ్లపై రేషన్ బియ్యం సరఫరా జరుగుతుంటే అధికారులు తనిఖీలు చేయక పోవడం వల్ల బాధ్యతరాహిత్యానికి నిర్దర్శనమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పేదల బియ్యం అక్రమార్కుల పాలు

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా రవాణా మార్గాలపై నిఘా, గోదాంల తనిఖీలు, నిల్వల రికార్డుల పరిశీలన, రీ ప్యాకింగ్ కేంద్రాల గుర్తింపు చేపట్టాల్సిన బాధ్యత సివిల్ సప్లై శాఖపై ఉంది. అక్రమ రవాణాకు సహకరిస్తున్న వారెవరైనా కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో సంయుక్త దాడులు నిర్వహించాలి. పత్రికలో కథనాలు వచ్చిన విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు చోద్యం చూడడం వెనక ముందుగానే వాళ్లకు కావలసింది అందాయ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేదల కడుపు నింపాల్సిన బియ్యం అక్రమార్కుల గోదాంలలో ఎందుకు మూలుగుతోంది.

అధికారుల నిఘా ఎక్కడ. టాస్క్ ఫోర్స్ దాడులు నిజంగానే అక్రమ దందాకు అడ్డుకట్ట వేస్తున్నాయా. లేక దాడుల పేరుతో కాలయాపన చేస్తున్నారా. సివిల్ సప్లై శాఖ మంత్రి, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భారీ షెడ్ నిర్మాణంపై అధికారుల దృష్టి పడేనా





- సాయి ప్రియ కాలనీలో నిర్మాణ పనులపై స్థానికుల ఆందోళన
- అనుమతుల వివరాలు బహిర్గతం చేయాలని విజ్ఞప్తి
- ఉల్లంఘనలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

కీసర,నవంబర్,3,మెదక్ టుడే న్యూస్:

కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ డివిజన్ సాయి ప్రియ కాలనీలో చేపడుతున్న భారీ షెడ్ నిర్మాణం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్మాణానికి సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందారా మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగానే పనులు చేపడుతున్నారా అన్న సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. భారీ విస్తీర్ణంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులపై అధికారుల స్పష్టత ఏదీ?

సదరు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూమి వినియోగం, వాణిజ్య కార్యకలాపాలకు వర్తించే నిబంధనలను పాటిస్తున్నారా లేదా అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నట్లు తేలితే మున్సిపల్ ఆదాయానికి గండి పడటంతో పాటు పట్టణ ప్రణాళిక వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. సామాన్యులు చిన్న పాటి నిర్మాణాలకు సైతం అనుమతులు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, భారీ షెడ్ నిర్మాణం విషయంలో అధికారుల పర్యవేక్షణ ఎక్కడుందంటూ ప్రశ్నిస్తున్నారు.

దివ్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించాలి!

సాయి ప్రియ కాలనీలో కొనసాగుతున్న భారీ షెడ్ నిర్మాణంపై కీసర సర్కిల్ డివ్యూటీ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతులు, భూమి వినియోగం, నిర్మాణ నిబంధనలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే సంబంధిత బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో ఎలాంటి ఉపేక్ష లేకుండా పారదర్శకంగా వ్యవహరించి, మున్సిపల్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నాలుగు రోజులైనా సీసీ రోడ్డుకు నీటి క్యూరింగ్ ఏది

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి అధికారుల అండదండలా.?
- ప్రశ్నించిన ఏఈ సూరజ్‌కు దురుసు సమాధానం
- ప్రజల సమస్యలను పట్టించుకోని ఇంజనీరింగ్ శాఖ, నాణ్యతపై స్థానికుల ఆగ్రహం
- క్యూరింగ్ చేయకపోవడంతో సిసి రోడ్డు నాణ్యత గాలికైన మరి అధికారుల పర్యవేక్షణ ఏది.?

నాచారం,నవంబర్,3, మెదక్ టుడే న్యూస్:

ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లకు లేదా. పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షించాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులకు లేదా. జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్ల నిర్మాణం పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలు గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాచారం సర్కిల్ లోని మల్లాపూర్ డివిజన్ పరిధిలోని రోడ్ నంబర్ 17, భవానీనగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తయినా క్యూరింగ్ ఏదీ.?

భవానీనగర్‌లో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేశారు. అయితే రోడ్డు నిర్మాణం పూర్తయి నాలుగు రోజులు గడుస్తున్నా, కనీసం నీటిని చల్లి క్యూరింగ్ చేసే బాధ్యతను కాంట్రాక్టర్ విస్మరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీ రోడ్డు పటిష్టంగా ఉండాలంటే నిర్ణీత పద్ధతిలో తగిన కాలం క్యూరింగ్ చేయడం అత్యంత కీలకం. క్యూరింగ్ సరిగా చేయకపోతే కాంక్రీట్‌లో పగుళ్లు ఏర్పడటం, మన్నిక పూర్తిగా తగ్గడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇంతటి కీలకమైన అంశాన్ని కాంట్రాక్టర్, నాచారం సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నది స్థానికుల ప్రశ్నిస్తున్నారు.





ప్రశ్నిస్తే దురుసు సమాధానమా.?

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై స్థానికులు సంబంధిత ఏఈ సూరజ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. కాంట్రాక్టర్‌ను ప్రశ్నించాల్సిన అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉండగా, స్థానికుల ఆరోపణల ప్రకారం ఏఈ సూరజ్ కూడా ఈ వ్యవహారంలో దురుసుగా సమాధానం ఇచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించినప్పుడు 'మీ ఇష్టం ఉన్నవాళ్లకు చెప్పుకోండి' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడినట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని స్థానికులు నిలదీస్తున్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజలకు జవా బుదారీగా ఉండాల్సిన అవసరం లేదా.మరి డిప్యూటీ జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ పూర్తిగా కనుమరుగైందని మండిపడుతున్నారు.

డిప్యూటీ, జోనల్ కమిషనర్లు స్పందించరా.?

జీహెచ్ఎంసి పరిధిలో ఒకవైపు నాణ్యత లేని పనులతో ప్రజాధనం వృథా అవుతుందనే ఆందోళన, మరోవైపు ప్రశ్నించిన ప్రజలతో అధికారుల దురుసు ప్రవర్తన. వెరసి భవానీనగర్‌లో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం పనితీరుపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు పూర్తయ్యాయని బిల్లులు చెల్లించే ముందు వాటి నాణ్యతను పరిశీలించే బాధ్యత ఎవరిది. క్వాలిటీ కంట్రోల్ లో నాణ్యత లేకున్నా బిల్లులు ఎలా జన్మిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. కాంట్రాక్టర్‌కు నిబంధనలు వర్తించవా. ఏఈ స్థాయి అధికారి పర్యవేక్షణలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే డిఈ, ఈఈ, ఎస్ఈ, ఉన్నతాధికారులు ఏం చేస్తున్నట్లు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ తక్షణమే స్పందించి భవానీనగర్ సీసీ రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. కాంక్రీట్ నాణ్యత, క్యూరింగ్ నిర్వహణ, పనుల అంచనాలు, కాంట్రాక్టర్ బాధ్యతలను సమగ్రంగా తనిఖీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపైనా శాఖాపరమై న విచారణ జరపాలని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజాధనంతో రోడ్లు వేయడం అభివృద్ధా. లేక కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడమే లక్ష్యమా.మల్లాపూర్ లోని భవానీనగర్ రోడ్డు వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

రక్తపోటు ఉన్నవారు మందులను మానేస్తే కలిగే

దుష్పరిణామాలు ఇవే జాగ్రత్త పడాల్సిందే

అధిక రక్తపోటుతో బాధపడేవారు వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోకపోతే, గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యల నుంచి లభించే రక్షణ గణనీయంగా తగ్గిపోతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. 91 వేల మందికి పైగా పాల్గొన్న తొమ్మిది వైద్య పరిశోధనల వివరాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించారు. మందులను సక్రమంగా తీసుకున్నవారిలో తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలు 11 శాతం తగ్గినట్లు తేలింది. అయితే, తరచూ మందులు మానేసినవారిలో ఇలాంటి ప్రయోజనం చాలా తక్కువగా లేదా అసలు కనిపించలేదని పరిశోధకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 30 నుంచి 79 ఏళ్ల మధ్య వయసున్న సుమారు 140 కోట్ల మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. మందులు సూచించిన ప్పటికీ, దాదాపు సగం మంది వాటిని వైద్యుల సూచనల ప్రకారం తీసుకోవడం లేదని అంచనా.

సైంటిస్టుల అధ్యయనం..

ఈ పరిశోధనలో పాల్గొన్నవారిని వారు మందులు ఎంత క్రమం తప్పకుండా తీసుకుంటున్నారనే ఆధారంగా రెండు వర్గాలుగా విభజించారు. సూచించిన మందుల్లో కనీసం 80 శాతం తీసుకున్నవారిని క్రమం తప్పకుండా మందులు వాడేవారిగా, అంతకంటే తక్కువ తీసుకున్నవారిని నిర్లక్ష్యం చేసినవారిగా పరిగణించారు. వైద్యుల పర్యవేక్షణలో పరిశోధనలు కొనసాగుతున్నప్పటికీ, కాలం గడిచే కొద్దీ మందులు తీసుకోవడంలో క్రమశిక్షణ తగ్గినట్లు గుర్తించారు. మొదటి ఏడాదిలో 88 శాతం మంది మందులను సక్రమంగా తీసుకోగా, ఐదో ఏడాదికి ఆ సంఖ్య 79 శాతానికి పడిపోయింది.



కల్వకుంటలో ఉచిత మెగా వైద్య శిబిరం



మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 03

నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంటలో మంగళవారం వైభవ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్యం హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్‌తో పాటు గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించిన ఆర్వీఎం హాస్పిటల్ యాజమాన్యానికి క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైభవ్ ఫ్రెండ్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు కొండల్ రెడ్డి, అధ్యక్షులు మసూద్ అలీ, కార్యదర్శి మాధవరెడ్డి, కోశాధికారి పందిరి రవీందర్, దొడ్డ రాజు, టి. బాపురెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ లక్ష్మణ్, వైద్యులు భవిత, ప్రశాంత్, హర్షిత, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగూడ రోడ్డుపై ఆటో టిఫిన్ సెంటర్ల దందా

- రాత్రి వేళ రహదారిపై యథేచ్ఛగా ఆక్రమణలు.. వాహనదారులకు ట్రాఫిక్ నరకం
- పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ఒక్కో ఆటో టిఫిన్ సెంటర్ నుంచి నెలకు రూ.10 వేల మామూళ్ల వసూళ్ల ఆరోపణలు

సికింద్రాబాద్,నవంబర్,3, మెదక్ టుడే న్యూస్:

మెట్టుగూడ ప్రధాన రహదారి రాత్రి వేళల్లో ఆటో టిఫిన్ సెంటర్లకు అడ్డాగా మారుతోంది. పగటిపూట వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిపై రాత్రి 7 గంటలు దాటిందంటే చాలు.. ఆటో టిఫిన్ సెంటర్ల వ్యాపారం మొదలవుతోంది. ఆటోల్లోనే స్టవ్‌లు, ప్లేట్లు ఇతర సామగ్రిని ఏర్పాటు చేసుకుని రహదారి పక్కన, చివరకు రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్, ప్రయాణికులకు అవస్థలు

టిఫిన్ సెంటర్లకు వచ్చే వినియోగదారులు తమ ద్విచక్ర వాహనాలు, కార్లను రహదారిపైనే నిలిపివేస్తుండగా, మరోవైపు ఆటోలను అడ్డంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వార్తలు వచ్చినా మారని పరిస్థితి, దోంట్ కేర్ అంటున్నారా.?

మెట్టుగూడ రహదారిపై ఆటో టిఫిన్ సెంటర్ల ఆక్రమణలు, ట్రాఫిక్ ఇబ్బందులపై గతంలో పలు పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమైనప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో రాత్రివేళ రహదారిపై వ్యాపారాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే ఈ పరిస్థితి కొనసాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నెలకు రూ.10 వేల మామూళ్లు.?

ఈ వ్యవహారంలో మరో సంచలన ఆరోపణ తెరపైకి వస్తోంది. ఒక్కో ఆటో టిఫిన్ సెంటర్ నుంచి నెలకు రూ. 10 వేల వరకు మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే అక్రమ వ్యాపారాలపై చర్యలు తీసుకోవడం లేదని కొందరు వాహనదారులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల స్పందన ఎక్కడ.?

మెట్టుగూడ ప్రధాన రహదారిని ఆక్రమించి నిర్వహిస్తున్న ఆటో టిఫిన్ సెంటర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించి రహదారి ఆక్రమణలను తొలగించడంతో పాటు రాత్రివేళ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, రోడ్డుని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వాళ్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మామూళ్ల ఆరోపణలపై కూడా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం ఫారం--18 అందజేత...

ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో పాటు సిబ్బందికి ఫారాలు పంపిణీ....



వనపర్తి బ్యూరో నవంబర్ 3 హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని ఏఐపీసీ, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐపీసీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు జి. నాగార్జున, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు ఎత్తం చరణ్‌రాజ్ ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని సందర్శించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిమళతో పాటు కార్యాలయ సిబ్బందికి ఫారం--18 అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులందరూ ఫారం--18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డికి మద్దతుగా పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, పుట్ట బాలరాజు, కుమార్, రాజు, రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డంకి.. వైద్యుడిగా ఎదగాలన్నదే ఆశయం!


- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థి సూర్యప్రసాద్

కొల్లాపూర్:

చదువుకోవాలనే తపన ఉంది.. ప్రతిభకు కొదవలేదు.. వైద్యుడిగా ఎదిగి పేదలకు సేవ చేయాలనే బలమైన సంకల్పం ఉంది. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఆ ఆశయానికి అడ్డంకిగా మారుతున్నాయి. ప్రతిభ ఉన్నా పేదరికం కారణంగా వైద్యవిద్యను కొనసాగించలేని పరిస్థితి ఓ విద్యార్థిని కలచివేస్తోంది.నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలానికి చెందిన సూర్యప్రసాద్‌ది సాధారణ నిరుపేద కుటుంబం. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, చదువులో మాత్రం ఆయన తన ప్రతిభను చాటుకున్నారు. పదో తరగతిలో 9.0 జీపీఏ సాధించగా, ఇంటర్మీడియట్‌లో 950 మార్కులు పొందారు. అంతటితో ఆగకుండా నీట్ పరీక్షలో 402 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో 6,000 ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో 320వ ర్యాంకు సాధించడు.

ప్రతిభకు గుర్తింపు.. కానీ ఆర్థికంగా ఇబ్బందులు!

సూర్యప్రసాద్ కష్టానికి ఫలితంగా హైదరాబాద్‌లోని నోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ సీటు లభించింది. వైద్యవిద్యను అభ్యసించి డాక్టర్‌గా ఎదగాలన్న ఆయన కలకు ఇది తొలి అడుగు. అయితే వైద్యవిద్యకు అవసరమైన ఫీజులు, ఇతర ఖర్చులను భరించే స్థోమత కుటుంబానికి లేకపోవడంతో ఆ కలను సాకారం చేసుకోవడం కష్టంగా మారింది.



డ్రైవర్ తండ్రి.. కూలీ పనులు చేసే తల్లి

సూర్యప్రసాద్ తండ్రి వెంకటస్వామి డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి దేవేంద్రమ్మ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుటుంబంలో ఇద్దరు అక్కలు ఉన్నారు. వారిలో ఒకరికి వివాహం కాగా, మరొకరు బీఈడీ చదువుతున్నారు రోజువారీ కష్టార్జితంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తల్లిదండ్రులకు కుమారుడి వైద్యవిద్య ఖర్చులు భారంగా మారాయి. తమ కుమారుడు డాక్టర్ కావాలన్న ఆశ ఉన్నప్పటికీ, ఆర్థిక పరిస్థితులు వారికి ఆందోళన కలిగిస్తున్నాయి.

దాతలు ముందుకొస్తే.. ఓ కల నిజమవుతుంది!

పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదు. కష్టపడి చదివి వైద్యవిద్యలో సీటు సాధించిన సూర్యప్రసాద్‌కు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులు అండగా నిలిస్తే ఆయన తన లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంటుంది.ఓ నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి డాక్టర్‌గా ఎదిగితే అది ఆ కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా గర్వకారణం. ఆర్థిక సహాయం అందితే సూర్యప్రసాద్ తన వైద్యవిద్యను పూర్తిచేసి భవిష్యత్తులో ఎంతోమందికి సేవలందించగలరు.

రైతు చేతిలోనే నెల ఆరోగ్యం.. పాలెం కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైల



బిజినాపల్లి నవంబర్ 3. ఇతర పంటలు పంట మార్పిడి యజమాన్యం వంటి పద్ధతులతోనే నేల ఆరోగ్యానికి వాడుకోవచ్చునని ముఖ్యంగా నేల ఆరోగ్య రైతు చేతుల్లోనే ఉందని పాలెం కేవీకే ఓ సైలా అన్నారు మరి సాగు తర్వాత చిరుధాన్యాల సాగును చేపట్టినట్లయితే చాలా ఆరోగ్యంగా ఉంటుందని అందమైన యజమాన్య పద్ధతులు చేపట్టాలన్నారు మంగళవారం మండలంలోని పాలెం కేవీకే ప్రాంగణంలో నేల సంపూర్ణ ప్రచార కార్యక్రమపై రైతులు అవగాహన సదస్సు నిర్వహించారు డాక్టర్ చిరంజీవి డాక్టర్ వి దివ్యరాణిలు మాట్లాడుతూ నెలల్లో కృత్రిమ పెరుగు బదులుగా సేంద్రియ ఎరువు ఉపయోగించాలి భూసార పరీక్షల అనంతరం అధికారులు సూచించిన మేర మాత్రమే కృత్రిమ ఎరువు వాడాలన్నారు వేసవిలో నేలను లోతుగా కలియ దున్నాలని పంట నష్టాలను పొలంలో కాల్చరాదని అన్నారు సదస్సు 45 మంది రైతులు పాల్గొన్నారు

బొప్పలి వెంకటేష్ బొప్పలి వెంకటేష్ యాదవ్ కు ఘనంగా 'సేవరత్న అవార్డు' ప్రదానం

హైదరాబాద్:

జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ బొప్పలి వెంకటేష్ యాదవ్ ప్రతిష్టాత్మకమైన 'సేవరత్న అవార్డు'ను అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి మెయిన్ హాల్‌లో శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ మరియు శ్రీ నటరాజ నృత్య సంగీత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో "స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకలో సమాజంలో ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి నిర్వాహకులు బొప్పలి వెంకటేష్ యాదవ్ గారిని 'సేవరత్న అవార్డు'తో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు, ప్రముఖులు మరియు సాంస్కృతిక దిగ్గజాలు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు మరియు ఫౌండర్ బి. నాగేంద్ర యాదవ్ బొప్పలి వెంకటేష్ యాదవ్ గారి సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులోనూ ఆయన మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



డిసెంబర్ 15 నుంచి ఆశాల నిరవధిక సమ్మె

ఉమ్మడి పాలమూరు జిల్లాలో రిజర్వాయర్ల నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు.

పాలమూరు అంతులేని నిర్లక్ష్యం చేయడం వల్లే నేడు రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. 10 టీఎంసీల సామర్థ్యమున్న జూరాల ద్వారా 5.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. 22 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీరంగాపురం రిజర్వాయర్‌కు వెళ్లే కాలువకు బీఆర్ఎస్ సర్కారు మరమ్మతు చేసి ఉంటే 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందేవని గుర్తుచేశారు.ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా కేసీఆర్ పెడచెవిన పెట్టారన్నారు. లక్షల కోట్లు అప్పు చేసి కుడా జూరాల కింద గట్టు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లు నిర్మించలేదని ధ్వజమెత్తారు. ఈ రెండు రిజర్వాయర్లు నిర్మించి ఉంటే నేడు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని వివరించారు.కల్వకుర్తి లిఫ్ట్ కింద 20 టీఎంసీల రిజర్వాయర్ నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చ్ఞశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 15 టీఎంసీల సామర్థ్యంతో గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు...

మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసులు

నర్సంపేట నవంబర్ 3(:

ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు తెలిపారు.ఈ మేరకు నర్సంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లకు ఆశా కార్యకర్తలతో కలిసి సమ్మె నోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా గోనె యువరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని ఆరోపించారు. తమ సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేకపోవడంతో ఆశా కార్యకర్తలు నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నారని తెలిపారు. డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు విధులను బహిష్కరించి సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పీపీ యూనిట్ అధ్యక్షురాలు సంధ్య, బాంజీపేట పీహెచ్‌సీ అధ్యక్షురాలు సునీత, నాయకులు లలిత, రమ, సరోజన, లత, విజయ పాల్గొన్నారు.



printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..